
వరసిద్ధుడి బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం


వెలుగులీనుతున్న ప్రధాన ఆలయం


ప్రధాన ఆలయంలో తొలిగుంజ నాటుతున్న ఈవో గురుప్రసాద్


ప్రధాన ఆలయ రాజగోపురం

కాణిపాక వరసిద్ది వినాయకస్వామి బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధమైంది. శనివారం నుంచి 21 రోజుల పాటు నిర్వహించే బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఈవో గురుప్రసాద్ తెలిపారు. ప్రధాన ఆలయంతో పాటు అనుబంధ ఆలయాలను, పుష్కరిణిని ముస్తాబు చేశారు. విద్యుద్దీపాలు, వివిధ దేవతామూర్తుల లైటింగ్ ఆర్చిలతో కాణిపాక క్షేత్రం వెలుగులీనుతోంది. అన్ని ఆలయాలను వివిధ పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం ప్రధాన ఆలయంలో పందిరి ఏర్పాటు కోసం తొలిగుంజకు పూజలు చేసి అధికారులు నాటారు. లడ్డూ రుచి విషయంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఉండేందుకు పోటులో లడ్డూల నాణ్యతను ఈవో పరిశీలించారు. లడ్డూ విక్రయ కేంద్రాలు, పడితరం స్టోర్స్, అన్నదాన సత్రం, కల్యాణకట్టను తనిఖీ చేశారు. ఆలయం వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు అధికారులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

- ఐరాల(కాణిపాకం)

వినాయక పూజకు వేళాయె!


పుంగనూరులో విక్రయానికి సిద్ధంగా..


చిత్తూరులో మట్టి వినాయక ప్రతిమలు కొనుగోళ్లు

వినాయక చవితి పూజకు పల్లె, పట్నం సిద్ధమయ్యాయి. శనివారం నాటి పండుగకు పండుగకు అవసరమయ్యే పూలు, పండ్లు, పత్రి, స్వీట్లు తదితరాలను శుక్రవారమే కొనుగోలు చేశారు. దీంతో బజార్లన్నీ రద్దీగా మారాయి. తోపుడు బండ్లు, ఫుట్‌పాత్‌లపైనా పండ్లు, పత్రి, కాగితపు గొడుగులు, అరటి పిలకలు వంటి దుకాణాలు తాత్కాలికంగా వెలిశాయి. పర్యావరణ హితమైన మట్టి వినాయక ప్రతిమలకు ఎక్కువ మంది ప్రాధాన్యమిచ్చారు. ఇక, వీధులు.. కూడళ్ల వద్ద పందిళ్లు వేసి భారీ వినాయక విగ్రహాలను నిలిపి పూజలు చేయడానికి సిద్ధమయ్యారు. ఆయా ఉత్సవ నిర్వాహకులు ముందుగానే భారీ వినాయక విగ్రహాలకు ఆర్డర్లు ఇచ్చి తయారు చేయించారు. శుక్రవారం రాత్రికంతా వాహనాల్లో తీసుకొచ్చారు. శనివారం ఉదయం పూజలు చేశాక భక్తులకు దర్శనం కల్పించనున్నారు. కాగా, పండుగ అనంతరం ప్రతిమలను నిమజ్జనం చేయనున్నారు.

- చిత్తూరు కల్చరల్


కొనుగోలుదారులతో చిత్తూరు చర్చివీధిలో రద్దీ


భారీ వినాయక విగ్రహాన్ని వాహనంలో తీసుకెళుతున్న ఉత్సవ నిర్వాహకులు

ఎట్టకేలకు ఆన్‌లైన్‌లో జడ్పీ పీఎఫ్ స్లిప్పులు

● ఫలించిన చిత్తూరు కలెక్టర్ చొరవ

చిత్తూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఆందోళన కలిగిస్తున్న పీఎఫ్ ఖాతాల నిర్వహణలో మెరుగైన ముందడుగు పడింది. ఎట్టకేలకు పీఎఫ్ ఖాతాదారులు డిమాండు చేస్తున్నట్లుగా ఆన్‌లైన్‌లో పీఎఫ్ స్లిప్పులు విడుదలయ్యాయి. పీఎఫ్ ఖాతాల నిర్వహణలో అవకతవకల్ని ఎండగడుతూ ఎస్టీయూ మహాధర్నాకు సన్నద్ధం కావడంతో కలెక్టర్ సుమిత్‌కుమార్ చొరవ తీసుకుని జడ్పీ చైర్మన్, సీఈవోల సమక్షంలో ఎస్టీయూ నాయకులతో చర్చించారు. సమస్య తీరుతెన్నులను లోతుగా పరిశీలించి పరిష్కరించమని సమగ్ర వివరాలతో రాష్ట్ర పంచాయతీరాజ్ డైరెక్టర్ కృష్ణతేజకు లేఖ రాశారు. దీంతో ఆగస్టు 19 చిత్తూరు జిల్లా ఉపాధ్యాయ నాయకుల ప్రతినిధి బృందంతో విజయవాడలో కృష్ణతేజ సమావేశమ్యారు. సంబంధిత శాఖ సాంకేతిక విభాగం సిబ్బందిని పిలిపించి పీఎఫ్ చందాల వివరాలను పూర్తి స్థాయిలో సేకరించి ఆన్‌లైన్‌లో ఉంచాలని ఆదేశించారు. తమ వద్ద 2021 మార్చి వరకు మాత్రమే గణాంకాలు అందుబాటులో ఉన్నాయని, ఆ తర్వాతి వివరాలన్నీ జిల్లా పరిషత్‌ల నుంచి అందాల్సి ఉందని నివేదించారు. అందుబాటులో ఉన్న సమాచారాన్ని వెంటనే అందరికీ బహిర్గతమయ్యేలా ఆన్‌లైన్‌లో ఉంచాలని, మిగిలిన వివరాలను నిర్దిష్ట సమయంలోగా అన్ని జిల్లాల నుంచి తెప్పించాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం 2021 మార్చి వరకు అన్ని జిల్లాలకు సంబంధించిన పీఎఫ్ స్లిప్పులను ఆన్‌లైన్‌లో విడుదల చేసింది. దీంతో వైసీపీ అధికారంలోకి వచ్చాక తమ పీఎఫ్ ఖాతాల్లో ఎంత మొత్తం ఉందో తెలుసుకోలేని స్థితిలో ఉన్న టీచర్లకు ఈ చర్య మంచి ఉపశమనాన్ని కలిగించింది. ఇదివరకు పీఎఫ్ రుణాలు పొందాలన్నా, పదవీ విరమణ చెందినవారు తుది మొత్తాలు పొందాలన్నా ఈ పీఎఫ్ స్లిప్పులు అందుబాటులో లేక తీవ్ర సమస్యలు ఎదుర్కొన్నారు. ప్రస్తుతం ఆ సమస్యకు పరిష్కారం లభించింది. మరికొన్ని రోజుల్లో ఇప్పటివరకూ ఉన్న పూర్తి వివరాలతో పీఎఫ్ స్లిప్పులు అప్‌డేట్ కానున్నాయి. ఈ పీఎఫ్ సమస్య పరిష్కారానికి చిత్తూరు కలెక్టర్ సుమిత్‌కుమార్ తీసుకున్న చొరవ రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది ఉద్యోగులకు ఉపశమనం కలిగించింది. ఈ విషయంలో కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్మాణాత్మక చర్యల పట్ల ఉద్యోగ, ఉపాధ్యాయులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

కోతులను తరిమేందుకు మంకీ గన్


మంకీ గన్‌లో ఉపయోగించే కార్బయిడ్ రాయి

పంట పొలాలు.. ఇళ్ల వద్ద కోతుల బెడద ఉందా? వీటిని తరిమేందుకు ఇబ్బంది పడుతున్నారా? అలాంటి వారికి మంకీ గన్ ఉపయోగపడుతోంది. పలమనేరులో వీటిని రూ.150 చొప్పున విరివిగా కొంటున్నారు. మహారాష్ట్రలోని జులేగావ్‌కు చెందిన సాగర్ అనే యువకుడు వీటిని విక్రయిస్తున్నారు. ఈ గన్ పేల్చడం వల్ల వచ్చే శబ్దానికి కోతులు పరుగులు పెడుతున్నాయి. ఈ మంకీ గన్‌కు గ్యాస్ వెల్డింగ్ షాపుల్లో వినియోగించే కార్బయిడ్ రాయిని వాడాలి. అడుగు పొడవున్న 3 అంగుళాల పైపుతో ఈ గన్‌ను తయారు చేశారు. వెనుక వైపు గ్యాస్ లైటర్ ఏర్పాటు చేసుంది. పైపు మధ్యలో ఒక రంధ్రంలోకి కార్బయిడ్ రాయి వేసి.. దానిపై నీటి చుక్కలు వేసి ఆ రంధ్రాన్ని పైపుకు ఏర్పాటు చేసిన మరో పైపుతో మూసి వేయాలి. కోతులున్న వైపు గన్ పెట్టి.. పైపు వెనుక వైపు ఏర్పాటుచేసిన గ్యాస్ లైటర్‌ను నొక్కగానే పెద్ద శబ్దం రావడంతో పాటు పైపు ముందు భాగంనుంచి తపాకీ నుంచి వచ్చే ఫైర్ కనిపిస్తుంది. ఈ శబ్దానికి చెట్లపై నుంచి కోతులు దూకి పరుగులు తీస్తాయి. దీంతో వీటి కొనుగోలుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. దీనివల్ల ఏమాత్రం ప్రాణహాని కానీ, ప్రమాదం కానీ లేవని సాగర్ చెప్పారు.

- పలమనేరు



అమ్మకానికి సిద్ధంగా ఉన్న మంకీ గన్లు - ఇలా పేల్చాలంటూ చూపుతున్న విక్రయదారుడు సాగర్

ప్రశాంతంగా వి.కోట


వి.కోటలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

వి.కోట, సెప్టెంబరు 6: రెండు రోజుల 144 సెక్షన్ అనంతరం వి.కోటలో సాధారణ పరిస్థితులు నెలకొన్నాయి. శుక్రవారం కూడా పోలీసు బందోబస్తు కొనసాగిస్తున్నారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచారు. ఏడు కేసులకు సంబంధించి నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. శాంతి భద్రతలపై పలమనేరు డీఎస్పీ ప్రభాకర్ సమీక్షించారు. వినాయక చవితి నేపథ్యంలో వి.కోటలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలని ఎస్పీ మణికంఠ పోలీసు అధికారులను ఆదేశించారు. ఇక, శుక్రవారం కలెక్టరు సుమిత్‌కుమార్ వి.కోటకు వచ్చి.. బాధితుల వివరాలు, నష్ట పోయిన దుకాణదారుల జాబితాపై అధికారులతో మాట్లాడారు. సుమారు రూ.40 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు తహసిల్దార్ పార్వతి ప్రాథమిక నివేదిక అందజేశారు. నాలుగు రోజుల కిందటి అల్లర్లలో ధ్వంసమైన దుకాణాలకు సత్వర పరిహారం అందజేసేందుకు కృషి చేస్తామని బాధితులకు హామీ ఇచ్చారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ మాధురీలత, ఆర్డీవో మనోజ్‌కుమార్‌రెడ్డి, సీఐ సోమశేఖర్, ఎస్ఐ బాబు, అధికారులు ఉన్నారు.

సమస్యల పరిష్కారమేదీ?

అధికారుల తీరుపై జడ్పీ సమావేశంలో ఎమ్మెల్యేల ఆగ్రహం





జడ్పీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్మన్ శ్రీనివాసులు, హాజరైన సభ్యులు

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 6: 'ఎప్పుడు మీటింగ్ పెట్టినా అధికారులు వస్తున్నారు. మేం చెప్పే సమస్యల్ని నోట్ చేసుకుంటున్నారు. పరిష్కారం మాత్రం చేయడం లేదు. రెండు నెలల కిందట జరిగిన జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో మేం ప్రస్తావించిన ఏ సమస్య కూడా పరిష్కారం కాలేదు' అంటూ ఆయా శాఖల జిల్లా అధికారులను ఎమ్మెల్యేలు నిలదీశారు. చిత్తూరులోని జడ్పీ సమావేశ మందిరంలో ఛైర్మన్ శ్రీనివాసులు అధ్యక్షతన శుక్రవారం జిల్లా పరిషత్తు సర్వసభ్య సమావేశం జరిగింది. ఉమ్మడి జిల్లాలోని పలువురు అధికార పార్టీ ఎమ్మెల్యేలతో పాటు ప్రతిపక్ష ప్రజాప్రతినిధులూ హాజరయ్యారు. సమస్యలపై అధికారులను నిలదీశారు. జడ్పీ సమావేశాల్లో ఆయా అంశాలు, శాఖల గురించి ఎంత చర్చించినా ఫలితం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. మొత్తం పది అంశాలపై చర్చ జరగాల్సి ఉండగా.. ఒక్కో అంశం గురించే సుదీర్ఘ చర్చ జరగడంతో ఐదింటితో సమావేశాన్ని ముగించారు. దాదాపు ప్రతి ఒక్కరూ ఆయా సమస్యల గురించి సమావేశంలో చర్చించారు. కొందరు జడ్పీటీసీలు కూడా మాట్లాడారు. వీరు చెప్పిన సమస్యలను కలెక్టర్ సుమిత్‌కుమార్ నోట్ చేసుకుంటూ పరిష్కార మార్గాలు చెప్పారు. ఈ సమావేశానికి తిరుపతి ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీలు భరత్, చంద్రశేఖర్‌రెడ్డి, చంద్రగిరి, జీడీనెల్లూరు, తిరుపతి, పూతలపట్టు ఎమ్మెల్యేలు పులివర్తి నాని, థామస్, ఆరణి శ్రీనివాసులు, మురళీమోహన్, జడ్పీటీసీలు, జేసీ విద్యాధరి, మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్, తిరుపతి డీఆర్వో పెంచల కిశోర్, జడ్పీ వైస్ ఛైర్‌పర్సన్ రమ్య, సీఈవో గ్లోరియా తదితరులు పాల్గొన్నారు.

'ఇసుక' దుమారం

కర్ణాటక సరిహద్దులోని రామసముద్రం మండలంలో ఇసుక రీచ్ లేదని, ప్రజలు ఇళ్లు ఎలా నిర్మించుకోవాలని జడ్పీటీసీ రామచంద్రారెడ్డి నిలదీశారు. పక్క మండలాల నుంచి తెచ్చుకుంటుంటే పోలీసులు పట్టుకొని కేసులు పెడుతున్నారన్నారు. ఉచిత ఇసుక విధానమంటే ఇదేనా అని ప్రశ్నించారు. దీనిపై పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్ కలగజేసుకొని ఇసుక కొరత ఉందని చెప్పండి కానీ.. ఉచిత ఇసుక విధానాన్ని మాత్రం ప్రశ్నించవద్దని సూచించారు. నదుల్లో ఇసుక లేకుండా వైసీపీ నాయకులు లూటీ చేస్తే ఎక్కడి నుంచి ఉంటుందని ఆయన ప్రశ్నించారు. అనంతరం కలెక్టర్ కలగజేసుకొని.. నదులు, వంకల్లో ఇసుక లేదని, మరోసారి వరదలు వస్తే తప్ప లభ్యం కాదన్నారు. పోలీసులు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుంటున్నారని జడ్పీటీసీ అడిగిన ప్రశ్నకు 'ఫలానా చోట ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారని తనకే పదుల సంఖ్యలో ఫోన్లు వస్తున్నాయని కలెక్టర్ సమాధానం చెప్పారు. ఎక్కడైనా మనుషుల ద్వారా మాత్రమే ఇసుక తవ్వుకోవచ్చని చెప్పారు.

ప్రాణాలు పోతున్నాయ్: థామస్

'గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో ఎలాంటి హెల్త్‌కేర్ సౌకర్యం లేదు. చిన్న రోడ్డు ప్రమాదం జరిగినా చిత్తూరు, చీలాపల్లి సీఎంసీకి తీసుకెళ్లాల్సి వస్తోంది. ఈలోపు ప్రాణాలు పోతున్నాయి. ఇక, జనరల్ ఫిజీషియన్, జనరల్ మెడిసిన్ చేసిన వైద్యులు అందించాల్సిన వైద్యాన్ని పెనుమూరు సీహెచ్‌సీలో కళ్లు, పళ్ల డాక్టర్లు చేస్తుండడం దారుణం. పాలసముద్రం, వెదురుకుప్పం మండలాల్లో పాము కరిస్తే వైద్యం కోసం కొన్ని కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తోంది' అంటూ వైద్య సమస్యను కలెక్టర్ దృష్టికి ఎమ్మెల్యే థామస్ తీసుకెళ్లారు. నియోజకవర్గంలో సూపర్ స్పెషాలిటి ఆస్పత్రి నిర్మించాలని కోరారు. జీడీనెల్లూరును ఇండస్ట్రీ హబ్‌గా మార్చడానికి అన్ని రకాల అవకాశాలున్నాయన్నారు. అధికారులు ముందుకు వస్తే తాను పెట్టుబడులు తీసుకొస్తానని, యువతకు ఉద్యోగవకాశాలు కల్పిస్తామన్నారు. ఇండస్ట్రీలన్నీ శ్రీసిటీకే పోతున్నాయని, అక్కడ మనవారికి ఉద్యోగాలు కల్పించడం లేదని ఆరోపించారు.

ఇంటికొకరికి డయేరియా

బంగారుపాళ్యం దళితవాడలో 400 కుటుంబాలు ఉంటే కలుషితమైన నీరు తాగి ఇంటికొకరు డయేరియాకు గురయ్యారని ఎమ్మెల్యే మురళీమోహన్ ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు తీసుకోలేదన్నారు. ట్యాంకులు, పైపులు శుభ్రం చేయడం లేదని ఆరోపించారు.

విలువైన పట్టాలన్నీ వైసీపీ వాళ్లకే: నాని

విలువైన పట్టాలన్నీ వైసీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు వారి సొంతవారికే కేటాయించారని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఆరోపించారు. చంద్రగిరి మండలం తొండవాడలో పేదల ఇళ్ల స్థలాల కేటాయింపు కోసం ప్రభుత్వం భూసేకరణ చేసిందని, అందులో వైసీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు వారి బినామీల పేర్లపై పట్టాలు తీసుకున్నారన్నారు. ప్రస్తుతం అక్కడ భారీ ఇళ్ల నిర్మాణం జరుగుతోందన్నారు. దీనిపై విచారించి రద్దు చేయాలని కలెక్టర్‌ను కోరారు. నిజమైన అర్హులకు మాత్రం కొండల్లో గుట్టల్లో ఇంటి పట్టాలు ఇచ్చారన్నారు. ఐతేపల్లి- తిరుపతి మధ్య 108 వాహనం లేకపోవడం ఇబ్బందిగా మారిందని, దీంతో హైవేలో రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. చంద్రగిరిలో వాడకంలో లేని పీహెచ్‌సీని ప్రారంభించాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. తిరుపతిలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ప్రభుత్వాస్పత్రికి కన్నా ప్రైవేటు ఆస్పత్రులకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వాస్పత్రులను బలోపేతం చేయాలని కోరారు.

ఒక్క డీఈవో కూడా రాలేదు: ఎమ్మెల్సీ

'ఉమ్మడి జిల్లాకు సంబంధించిన జడ్పీ సర్వసభ్య సమావేశం జరుగుతుంటే ఒక్క డీఈవో కూడా సమావేశానికి హాజరు కాకపోవడం దారుణం. వారికి ప్రజాప్రతినిధులు, కలెక్టర్ అంటే లెక్కే లేదు'అని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ఆయా జిల్లాల పరిధిలో విద్యాశాఖలో సమస్యలుంటే ఎవరికి చెప్పాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను అగౌరపరచడమేనన్నారు. రికార్డుల ప్రకారం చూస్తే నాడు- నేడు పనులు తొలివిడత ఇంకా పూర్తి కాలేదన్నారు. అసంపూర్తిగా ఉన్న కట్టడాల వద్దకు వెళ్లి విద్యార్థులు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. నెల్లూరు జిల్లాలోని ఓ పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న గోడ కూలిపోయిన 8వ తరగతి విద్యార్థి మృతి చెందాడని, అనేక చోట్ల విద్యార్థులు గాయాలపాలవుతున్నారన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. చిత్తూరు, తిరుపతి జిల్లాలతో పోల్చుకుంటే అన్నమయ్య జిల్లా చదువులో వెనబడిందన్నారు. దీనికి పూర్తి బాధ్యత జిల్లా విద్యాశాఖ అధికారులదేనన్నారు. అన్నమయ్య జిల్లాలో డిజిటల్ విద్య ప్రారంభం కాలేదని, విద్యార్థులకు ఒక్క ట్యాబ్ ఇచ్చిన దాఖలాలు లేవని పేర్కొన్నారు.

చిత్తూరు డీఈవోపై ఫిర్యాదు

'చిత్తూరు డీఈవో దేవరాజు ఎమ్మెల్యేల మాటల్ని అస్సలు లెక్క చేయడం లేదు. ఏదైనా చెప్పినా పట్టించుకోవడం లేదు. దీన్ని మీరు సరిదిద్దండి' అని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వైసీపీ మూలాలున్న డీఈవో దేవరాజు మీద పులివర్తి నానితో పాటు చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, మురళీమోహన్ కూడా గతంలో ఆగ్రహించారు. రాష్ట్రస్థాయి అధికారులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.

క్యాన్సర్ బాధితులందరికీ అందని చికిత్స: ఎంపీ

ఉమ్మడి జిల్లాలోని క్యాన్సర్ రోగులందరికీ చికిత్స అందించడం లేదని తిరుపతి ఎంపీ గురుమూర్తి ఆరోపించారు. రోగుల సంఖ్య వేలల్లో ఉంటే చికిత్సకు నోచుకున్న వారు వందల్లోనే ఉన్నారన్నారు. దీనిపై దృష్టి సారించాలని తిరుపతి డీఎంహెచ్‌వోను ఆదేశించారు.

మదనపల్లె మార్కెట్‌లో నిలువుదోపిడీ

మదనపల్లె మార్కెట్‌లో టమోటా రైతులను వ్యాపారులు సిండికేట్‌గా మారి నిలువునా దోపిడీ చేస్తున్నారని జడ్పీటీసీ సభ్యుడు ఉదయ్‌కుమార్ కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. 10 బాక్సుల టమోటాకు ఒక బాక్సు ఫ్రీగా ఇవ్వాలన్న జాక్‌పాట్ వ్యవస్థను రద్దు చేయాలన్నారు. 30 కిలోల బాక్సుల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, వాటి స్థానంలో 15 కిలోల బాక్సులు ప్రవేశపెట్టాలని అధికారులను కోరారు.

సకల శుభాలు కలగాలి

చిత్తూరు సిటీ/చిత్తూరు, సెప్టెంబరు 6: ప్రజలందరి జీవితాల్లో సకల శుభాలు కలగాలని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు ఆకాంక్షించారు. జిల్లా ప్రజలకు ఆయన వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. వినాయక మండపాల్లో, నిమజ్జనం సమయంలో తగిన జాగ్రత్తలు పాటించి సురక్షితంగా, సంతోషంగా పండగ జరుపుకోవాలని ఒక ప్రకటనలో కోరారు. ప్రజల జీవితాల్లో విఘ్నాలు తొలగిపోయి విజయాలు సిద్ధించాలని ఎస్పీ మణికంఠ ఆకాంక్షించారు. ఆయన జిల్లా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.

సవరం వారి పల్లెవద్ద ఏనుగుల విధ్వంసం



ఏనుగులు ధ్వంసం చేసిన చెరకు తోట, ధ్వంసమైన డ్రిప్ పరికరాలు

సోమల, సెప్టెంబరు 6: సోమల మండలం చిన్నఉప్పరపల్లె పంచాయతీ సవరంవారిపల్లె సమీపంలోని పొలాలను గురువారం రాత్రి తొక్కి నాశనం చేశాయి. గట్టువారిపల్లె చెరువుకోన సమీపంలో కొద్ది రోజులుగా మకాం వేసిన ఏనుగులు పగలు అడవిలో ఉండి రాత్రి పొలాలపై పడుతున్నాయి. రాత్రి వేళ వేరుశనగ పొలాల్లోకి అడవి పందులు వస్తుండడంతో కాపు కాసేందుకు వెళుతున్న రైతులు ఏనుగుల రాకను గుర్తించి పరుగులు పెట్టి గ్రామానికి చేరుకున్నారు. సవరంవారిపల్లెకు చెందిన రామయ్య, బాలాజీ చెరకుతోట, రాజాకు చెందిన వరి పొలంలో ఏనుగులు సంచరించాయి. డ్రిప్ పరికరాలు ధ్వంసం చేశాయి. మామిడి కొమ్మలు విరిచేశాయి. గట్టువారిపల్లె నుంచి నాలుగు, చెరువుకోన నుంచి మరో మూడు ఏనుగుల రావ డంతో రైతులు భయపడుతున్నారు. పలువురు రైతులు వేరుశనగ, టమోటా, వేసి పొలాల వద్ద అడవి పందుల కోసం రాత్రి జాగరణలు చేస్తున్నారు. ఏనుగులు ఈ ప్రాంతానికి రావడంతో దిక్కు తోచని స్థితిలో పడ్డారు. అటవీ అధికారులు స్పందించి ఏనుగుల బారి నుంచి పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

మ్యారేజ్ సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌లో దోపిడి

రిజిస్ట్రేషన్‌కు రూ.2500 వసూలు - ఆగ్రహించిన నూతన దంపతులు



సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌లో నమోదు ప్రక్రియ ఆగిపోవడంతో నిరీక్షిస్తున్న నూతన దంపతులు - సిగరెట్ ప్యాకెట్లతో పట్టుబడిన ఉద్యోగి

తిరుమల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తిరుమలలోని మ్యారేజ్ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో సిబ్బంది నూతన దంపతుల నుంచి దోపిడీకి పాల్పడుతున్నారు. రిజిస్ట్రేషన్ ధర రూ.500గా ఉంటే కార్యాలయంలోని సిబ్బంది మాత్రం నిబంధనలకు విరుద్ధంగా రూ.2వేల నుంచి రూ.2,500 వసూలు చేస్తున్నారంటూ శుక్రవారం పలువురు నూతన దంపతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుమలోని పౌరోహిత సంఘంలో నిరంతరం సామూహిక వివాహాలు జరుగుతుంటాయి. ఈక్రమంలో భక్తుల సౌకర్యార్థం ప్రభుత్వం మ్యారేజ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని పౌరోహిత సంఘంలోనే ఏర్పాటు చేసింది. పెళ్లిళ్లు జరిగిన వెంటనే భక్తులు ఈకార్యాలయంలో సంబంధిత పత్రాలు అందజేసి రూ.500 కట్టి మ్యారేజ్ రిజిస్ట్రేషన్ పత్రాన్ని పొందుతున్నారు. కొంతకాలంగా ఈ కార్యాలయంలోని సిబ్బంది భారీ స్థాయిలో భక్తుల నుంచి నగదు వసూలు చేస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఈక్రమంలో శుక్రవారం సాయంత్రం కొందరు భక్తులు కార్యాలయ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. నిబంధనల ప్రకారం అన్ని పత్రాలు, ఫొటోలు అందజేసినప్పటికీ ఎలాంటి రసీదు లేకుండా అధిక మొత్తంలో వసూలు చేయడం అన్యాయమన్నారు. జరుగుతున్న తప్పును చెప్పుకుందామంటే సంబంధిత అధికారి కూడా అందుబాటులో లేరని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా టీటీడీ ఉన్నతాధికారులు, ప్రభుత్వ అధికారులు జరుగుతున్న అక్రమంపై చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా, వివాదం జరుగుతోందనే సమాచారంతో విజిలెన్స్ అధికారులు ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆ కార్యాలయంలో పని చేస్తున్న ఓ వ్యక్తిని తనిఖీ చేయగా తిరుమలలో నిషేధమైన సిగరెట్ ప్యాకెట్లు లభించడం గమనార్హం. దీంతో నూతన దంపతుల నుంచి జరుగుతున్న దోపిడీపై, నిషేధిత వస్తువులు లభించడంపైనా విచారణ చేపట్టారు.

బీటెక్ రెండో సెమిస్టర్ ఫలితాల విడుదల

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 6: పద్మావతి మహిళా యూనివర్సిటీ జూన్‌లో నిర్వహించిన బీటెక్ ఫస్టియర్ ఫలితాలు విడుదలయ్యాయి. ఈఈఈ, మెకానికల్, ఈసీఈ కోర్సులకు సంబంధించిన రెండో సెమిస్టర్ ఫలితాలను.. ఎస్‌పీఎంవీవీ.. వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్టు పీఆర్వో శ్రీరజని తెలిపారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.20 కోట్లు

తిరుమల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.20 కోట్లు లభించింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ గురువారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు రూ.3.20 కోట్లు ఆదాయం లభించినట్టు టీటీడీ శుక్రవారం ఉదయం ప్రకటించింది. ఇక, గురువారం 61,142 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే 21,525 మంది భక్తులు శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.

ప్రశాంతంగా చవితి వేడుకలు : ఆర్డీవో



మండపాల నిర్వాహకులతో సమావేశమైన ఆర్డీవో మనోజ్‌కుమార్

వి.కోట, సెప్టెంబరు 6: వి.కోట మండల పరిధిలో వినాయక చవితి పండుగను ప్రశాంతంగా నిర్వహించుకోవడానికి ప్రజలందరూ సహకరించాలని పలమనేరు ఆర్డీవో మనోజ్‌కుమార్‌రెడ్డి కోరారు. ఈసారి వేడుకలు అత్యంత కట్టుదిట్టమైన భద్రత నడుమ నిర్వహించనున్నట్లు తెలిపారు. వి.కోట అర్బన్ పోలీసు స్టేషన్‌లో శుక్రవారం సాయంత్రం మండపాల నిర్వాహకులతో ఆయన సమావేశమయ్యారు. వి.కోటలో నాలుగు రోజుల క్రితం చోటు చేసుకున్న ఘటనల నేపథ్యంలో శాంతి కమిటీ సభ్యులతోను సమావేశం నిర్వహించారు. గతంలో జరిగిన ఘటనలను పరిగణనలోకి తీసుకుని ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగకుండా అన్ని వర్గాల వారు అన్నదమ్ముల్లా పండుగను జరుపుకోవాలన్నారు. విగ్రహాల ఏర్పాటుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రభుత్వ నిబంధనలను వివరించారు. వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తీసుకువెళ్లే క్రమంలో అన్ని వర్గాలు సంయమనంతో వ్యవహరించాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ ప్రభాకర్ హెచ్చరించారు. విగ్రహాలు ఏర్పాటు చేసిన మూడు రోజుల అనంతరం పత్రపల్లె చెరువులో నిమజ్జనం చేయడానికి ఏర్పాట్లు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ పార్వతి, ఎంపీడీవో మహ్మద్‌రఫీ, సీఐ సోమశేఖర్, ఎస్ఐ బాబు, పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో కార్మికుడిపై హత్యాయత్నం

● పోలీసుల అదుపులో పీలేరువాసి



గాయపడిన నరసింహ - దాడికి పాల్పడిన ఉదయ్‌కిరణ్

తిరుమల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఓ భవన నిర్మాణ కార్మికుడిపై పీలేరుకు చెందిన యువకుడు హత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసుల తెలిపిన వివరాల మేరకు.. అనంతపురానికి చెందిన నరసింహ(34) కొన్నేళ్లుగా తిరుమలలో భవన కార్మికుడిగా పనిచేస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం పాంచజన్యం విశ్రాంతి భవనం వద్ద ఉన్న కారు పార్కింగ్‌లో టీమాస్టర్‌గా పనిచేస్తున్న పీలేరుకు చెందిన ఉదయ్‌కిరణ్(22)తో వాగ్వాదం జరిగింది. ఒకరిపై ఒకరు దాడి చేసుకుంటూ వీరంగం సృష్టించారు. సహనం కోల్పోయిన ఉదయ్‌కిరణ్ తన జేబులో ఉన్న ప్లాస్టిక్ గ్రిప్ పేపర్ కట్టర్‌తో నరసింహపై దాడిచేశాడు. దీంతో నరసింహ మెడపై తీవ్ర గాయమైంది. అక్కడున్న వారు బాధితుడిని తిరుమలలోని అశ్విని ఆస్పత్రికి పంపారు. ఈ సమాచారంతో టూటౌన్ సీఐ మురళీమోహన్‌రావు సిబ్బందితో వెళ్లి ఉదయ్‌కిరణ్‌ను అదుపులోకి తీసుకున్నారు. గాయపడ్డ నరసింహను మెరుగైన చికిత్స కోసం తిరుపతిలోని రుయాస్పత్రికి తరలించారు. టీ విక్రయం విషయంలోనే ఇద్దరి మధ్య వాగ్వాదం మొదలైనట్టు పోలీసులు తెలిపారు. కాగా, ఉదయ్‌కిరణ్ మత్తులో ఉన్నట్టు తెలిసింది.

టీటీడీ సమాచార కేంద్రాలు, ఆలయాలకు 75 వేల లడ్డూలు పంపాం

● టీటీడీ ఈవో శ్యామలరావు

తిరుమల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి లడ్డూలకు సంబంధించి దళారులను అరికట్టాలనే ఉద్దేశంతో గతనెల 29వ తేదీ నుంచి దర్శనం చేసుకోని వారికి ఆధార్‌కార్డుపై రెండు లడ్డూలు మాత్రమే ఇచ్చే విధానాన్ని ప్రారంభించామని టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. దర్శనం చేసుకున్న భక్తులకు స్టాక్ లభ్యతను బట్టి రూ.50 చొప్పున కోరినన్ని లడ్డూలు అందిస్తున్నామన్నారు. చాలాకాలంగా బయటప్రాంతాల్లో ఉన్న టీటీడీ ఆలయాలు, చెన్నై, బెంగళూరు, వేల్లూరులోని టీటీడీ సమాచార కేంద్రాల్లో లడ్డూల డిమాండ్ ఉన్నప్పటికీ పంపలేకపోయామన్నారు. లడ్డూల జారీ విధానంలో నూతన మార్పుల కారణంగా నాలుగు రోజుల్లో దాదాపు 75 వేల లడ్డూలు ఆయా ప్రాంతాలకు పంపామన్నారు. దీన్ని శాశ్వత ప్రాతిపదికన అమలు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఆయా ఆలయాల్లో ఇందుకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు కార్యాచరణ ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ప్రస్తుతం రోజుకు 3.5 లక్షల లడ్డూలను తయారు చేస్తున్నామని, లడ్డూల తయారీని పెంచేందుకు అవకాశముందన్నారు. ఆవు నెయ్యి నిపుణుల కమిటీ సిఫార్సుల మేరకు లడ్డూ ప్రసాదం నాణ్యతను పెంచేందుకు ప్రస్తుతమున్న టెండర్ షరతులను అనుసరించి నాణ్యమైన నెయ్యి కొనుగోలు చేస్తున్నామన్నారు. గతంలో కల్తీ నెయ్యి సరఫరా చేసిన కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టామన్నారు. ముఖ్యంగా నెయ్యి నాణ్యత ప్రమాణాలను పరిశీలించేందుకు నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు.. టీటీడీకి ఒక గ్యాస్ క్రోమాటోగ్రాఫ్, హెచ్‌పీఎల్‌సీని విరాళంగా అందిస్తామని తెలిపాయన్నారు. దీని ధర సుమారు రూ.50 లక్షల వరకు ఉంటుందన్నారు. వీటిని ఈ ఏడాది డిసెంబరు నాటికి అమరుస్తారని వెల్లడించారు. అన్నప్రసాద విభాగాన్ని ఆధునీకరించడంతోపాటు అన్నప్రసాదాల పంపిణీ వ్యవస్థను పటిష్ఠం చేసేందుకు త్వరలో బెంగళూరు, హైదరాబాద్‌కు చెందిన నిపుణులు తిరుమలలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న అన్నప్రసాద కేంద్రాలను సందర్శిస్తారన్నారు. వీరి సూచనలతో భవిష్యత్తు అవసరాల దృష్ట్యా అన్నప్రసాద విభాగాన్ని శాశ్వతంగా సంపూర్ణస్థాయిలో ఆధునీకరిస్తామన్నారు. ప్రసాదాల్లో వినియోగించే జీడిపప్పు నాణ్యతపై కూడా దృష్టిసారించామన్నారు.

వృథా అవుతున్న సాంబారు, రసం

ఆన్‌లైన్ రేడియో ద్వారా భక్తిపాటలు ప్రసారం చేయండి

తిరుమలలోనూ డయాలసిస్ సౌకర్యం కల్పించండి

డయల్‌యువర్ టీటీడీ ఈవోలో భక్తులు

తిరుమల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అన్నప్రసాద భవనంలో సిబ్బంది భక్తులకు వడ్డించేటప్పుడు సాంబారు, రసం ఎక్కువగా పోసి వృథా చేస్తున్నారని నారాయణరాజు (కార్వేటినగరం), ఆన్‌లైన్ రేడియో ద్వారా ఉదయం, సాయంత్రం భక్తిపాటలు ప్రసారం చేయాలని మాలతి(హైదరాబాద్), భక్తులకు మెరుగైన కూరగాయలతో భోజనం పెట్టాలని రాఘవేంద్ర(వేలూరు) డయల్ యువర్ టీటీడీ ఈవో కార్యక్రమం ద్వారా ఈవో శ్యామలరావు దృష్టికి తీసుకొచ్చారు. వీటిపై ఈవో స్పందిస్తూ వృథా కాకుండా చర్యలు తీసుకోవడంతోపాటు పాటల ప్రసారంపై పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. కూరగాలయపై స్పందిస్తూ.. తిరుమలకు రోజూ 23 రకాల కూరగాయలు వస్తున్నాయని, మెనూ ప్రకారం నాణ్యత కలిగిన వాటినే అన్నప్రసాదాల్లో వాడుతున్నామని చెప్పారు. భాస్కర్(కడప) మాట్లాడుతూ.. లడ్డూలో నాణ్యత పెరిగిందని ప్రశంసించారు. మాడవీధుల్లో భక్తులు చెప్పులు లేకుండా నడిచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అన్నప్రసాద భవనంలో శ్రీవారిసేవకులకు, దివ్యాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, రూ.300 దర్శన టికెట్ రద్దు చేసుకుంటే డబ్బులు రీఫండ్ చేయాలని కోరారు. ఈవో బదులిస్తూ.. చెప్పులు లేకుండా భక్తులను అనుతించేలా భద్రతా సిబ్బంది పర్యవేక్షిస్తున్నారన్నారు. దివ్యాంగులకు అన్నప్రసాదాలను ప్రత్యేకంగా వడ్డిస్తామన్నారు. ఆన్‌లైన్ లక్కీడిప్‌లో సుప్రభాతం, తోమాల, అర్చన ఒక్కొక్కరికి కాకుండా, ఇద్దరికీ కేటాయించేలా చర్యలు తీసుకోవాలని, ఆలయంలోని క్యూలైన్లలో ఫ్యాన్లు, లైట్లు పనిచేయడం లేదని భావనారాయణ(గుంటూరు) తెలిపారు. చాలామంది సేవలకు ప్రయత్నిస్తున్న క్రమంలో ఇద్దరికి డిప్‌లో సేవలు కేటాయించడం సాధ్యం కాదని, క్యూలైన్లో ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని ఈవో బదులిచ్చారు. పరకామణిసేవ తరహాలోనే లడ్డూ ప్రసాదసేవను కూడా ప్రవేశపెట్టాలని ప్రదీప్‌కుమార్(హైదరాబాద్) కోరగా, టీటీడీ బోర్డు నిర్ణయం మేరకు లడ్డూప్రసాదసేవను రద్దు చేశామని ఈవో తెలిపారు. ఆన్‌లైన్‌లో గదులు పొందిన వారికి కాలినడక మార్గాల్లో స్కానింగ్ చేసుకునే వెసులుబాటు కల్పించాలని రమేష్‌బాబు (వైజాగ్) కోరగా, ఈవో పరిశీలిస్తామన్నారు. అంగప్రదక్షిణ టోకెన్లు పొందిన చాలామంది సేవకు రావడం లేదని, ఈక్రమంలో ఆఫ్‌లైన్‌లో కూడా ఇవ్వాలని ప్రవీణ్(కుప్పం) కోరారు. ఈ టోకెన్లను ఆఫ్‌లైన్‌లో ఇవ్వలేమని ఈవో బదులిచ్చారు. తిరుమలలో డయాలసిస్ సౌకర్యం కల్పించాలని వెంకటేష్ (హైదరాబాద్) కోరగా.. ఈవో పరిశీలిస్తామన్నారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

రెండు వేల మందికి బీసీవై పార్టీ బియ్యం పంపిణీ



పుంగనూరు, సెప్టెంబరు 6: విజయవాడ వరదముంపు బాధితులు 2వేల మందికి భారతచైతన్య యువజన పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచితంగా బియ్యం పంపిణీ చేసినట్లు ఆ పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరదముంపు ప్రాంతాలైన పాత ఆర్‌ఆర్‌పేట, న్యూఆర్‌ఆర్‌పేట, బసవతారకంనగర్, భవానీపురం, డబ్బాకొట్లు సెంటర్, భవానీపురం, సింగ్‌నగర్ ప్రాంతాల్లో బీసీవైపీ నాయకులు, కార్యకర్తలు వరద సహాయక కార్యక్రమాల్లో పాల్గొని నిత్యావసర వస్తువులు పంపిణీ చేసి రెండో దశ బియ్యం అందజేసినట్లు వివరించారు. మరోసారి వరద బాధితులకు అవసరమైన సహాయకాలు అందించనున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ సహాయక కార్యక్రమాల్లో బీసీవైపీ నాయకులు సాంబమూర్తి, రమేశ్‌యాదవ్, హరినాథరెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో టీడీపీ కార్యకర్త మృతి



హుసేన్

చౌడేపల్లె, సెప్టెంబరు6: గుండెపోటుతో టీడీపీ కార్యకర్త మృతిచెందాడు. ఈ సంఘటన చౌడేపల్లె మండలంలో శుక్రవారం సాయంత్రం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. దాదేపల్లెకు చెందిన హుసేన్(50) గుజిరి వ్యాపారి. ఈ క్రమంలో దాదేపల్లె నుంచి వస్తుండగా శెట్టిపేట సెంటర్ వద్ద గుండెపోటుకు గురయ్యాడు. వెంటనే తన ద్విచక్ర వాహనం ఆపి కిందకు దిగి అక్కడికక్కడే కుప్ప కూలి పోయాడు. స్థానికులు ఆటోలో స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. టీడీపీ మండల అధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పలమనేరు డివిజన్‌లో 543 వినాయక మండపాలు

పలమనేరు, సెప్టెంబరు6 : పలమనేరు పోలీసు సబ్‌డివిజన్‌లో ఉన్న 10 పోలీసు స్టేషన్ల పరిధిలో వినా యక చవితి సందర్భంగా 543 మండపాల ఏర్పాటుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు వచ్చాయని డీఎస్పీ డేగల ప్రభాకర్ తెలిపారు. కాగా పలమనేరులో 43 మండపాల కోసం దరఖాస్తులు చేసుకొన్నారని డీఎస్పీ తెలియ జేశారు. మండపాలు ఏర్పాటు చేసే వారు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని సూచించారు.

ఈ నెలాఖరు వరకు పోషణ మాసోత్సవాలు

పలమనేరు, సెప్టెంబరు6 : పలమనేరు ప్రాజెక్టు పరిధిలో సెప్టెంబరు 1నుంచి 30 వరకు పోషణ మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు సీడీపీవో ఇందిరా ప్రియదర్శిని తెలిపారు. శుక్రవారం పోషణ మాసోత్సవాల్లో భాగంగా స్థానిక ఆర్‌కే వీధిలోని అంగన్వాడీ కేంద్రం నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రంలో మహిళలకు 1000 రోజుల సంరక్షణ, ఎంసీపీ కార్డు ప్రాధాన్యత, రక్తహీనత నివారణ, పౌష్టికాహారం పై అవగాహన కల్పించారు. అనంతరం బాలింతలకు, గర్భవతులకు పౌష్టికాహార ప్యాకెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మెప్మా ప్రతినిధి బాబా, సూపర్‌వైజర్ నజ్మా, ఏఎన్‌ఎంలు సుజాత, నజియా, జయంతి, అంగన్వాడీ కార్యకర్తలు, అనసూయమ్మ, శివజ్యోతి, ఆశావర్కర్లు, ఆర్‌పీలు పాల్గొన్నారు.

ఉలవల పంపిణీ ప్రారంభం

రామకుప్పం, సెప్టెంబరు 6: రామకుప్పం మండలం కెంచనబల్ల రైతు సేవా కేంద్రంలో రైతులకు 80 శాతం రాయితీతో ఉలవలను నాయకులు ప్రారంభించారు. రైతులు ఉలవలను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, పత్ర నారాయణ, మునిరెడ్డి, చంద్రశేఖర్, సతీష్, గుణశేఖర్, శ్రీరాములు, బద్రీనాథ్, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

రెండు దుకాణాల దగ్ధం



బైరెడ్డిపల్లె, సెప్టెంబరు 6 : బైరెడ్డిపల్లె నాలుగురోడ్ల కూడలి వద్ద గురువారం రాత్రి రెండు దుకాణాలు దగ్ధమయ్యాయి. దాదాపు రూ.2లక్షల ఆస్తినష్టం జరిగింది. వెంకటరమణకు చెందిన చెప్పుల దుకాణం, కన్నయ్యకు చెందిన పూలదుకాణం పూర్తిగా దగ్ధమైంది. పలమనేరు అగ్నిమాపక సిబ్బంది బైరెడ్డిపల్లెకు చేరుకుని మంటలు పరిసర దుకాణాలకు వ్యాపించకుండా అదుపుచేశారు. షార్ట్‌సర్క్యూట్ వల్ల అగ్నిప్రమాదం జరిగిందా లేదా ఎవరైనా నిప్పుపెట్టారా అనేది తెలియడంలేదు. కాగా దగ్ధమైన దుకాణాలను శుక్రవారం టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు పరిశీలించారు. బాధితులను పరామర్శించారు. నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలని బాధితులు తహసీల్దార్ మాధవరాజుకు వినతిపత్రాన్ని అందజేశారు.

వరద బాధితుల కోసం విరాళాలు

పలమనేరు, సెప్టెంబరు6 : విజయవాడ వరద బాధితుల కోసం పలమనేరు నుంచి పలువురు ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళాలు పంపించారు. పలమనేరు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో రూ. 1,01,616లు, పలమనేరులోని మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.44,000 పంపించినట్లు అధ్యక్షులు సుబ్రమణ్యంపిళ్లై, డాక్టర్ యుగంధర్ తెలిపారు. కాగా పట్టణ సమీపంలోని చైతన్య జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో రూ. 1,50,000లు పంపించినట్లు కళాశాల అధ్యాపకులు కిషోర్ తెలిపారు.

వరద బాధితులకు మెప్మా రూ.1.5 లక్షల సాయం



ఎమ్మెల్సీ కంచర్లకు చెక్కు అందిస్తున్న కమిషనర్

కుప్పం, సెప్టెంబరు 6: కుప్పం పురపాలక సంఘం పరిధిలోని 1115 మెప్మా గ్రూపుల ప్రతినిధులు విజయవాడ వరద బాధితులకోసం రూ.1.50 లక్షలను సమీకరించారు. ఈ మొత్తాన్ని శుక్రవారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు చేతులమీదుగా ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌కు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ, కమిషనర్‌లు మాట్లాడుత ప్రతిఒక్కరూ వరద బాధితుల కోసం తోచిన సాయాన్ని అందించాలని విన్న వించారు.

విద్యార్థుల అ'పూర్వ' కలయిక

చౌడేపల్లె, సెప్టెంబరు6: మేకలచిన్నేపల్లె హైస్కూల్లో 2006-07 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు శుక్రవారం కలుసుకున్నారు. గురువులను సన్మా నించారు. విద్యా ర్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

మట్టి విగ్రహాల పంపిణీ



చౌడేపల్లె, సెప్టెంబరు6: జేడీ ఫౌండేషన్, హర్షల్ ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాలు పంపిణీ చేశారు. హర్షల్ ఫౌండేషన్ సభ్యురాలు భవాని శుక్రవారం స్థానిక హైస్కూల్ సమీపంలో మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు.

దారి సమస్యపై అధికారుల విచారణ

బైరెడ్డిపల్లె, సెప్టెంబరు 6 : బైరెడ్డిపల్లె సమీపంలో వున్న జగనన్న కాలనీని శుక్రవారం ఎంపీడీవో రాజేంద్ర బాలాజీ, తహసీల్దార్ మాధవరాజు, హౌసింగ్ ఏఈ స్వామిదాస్ పరిశీలించారు. జగనన్న కాలనీ దారిసమస్య పరిష్కరించాలని ఇటీవల బైరెడ్డిపల్లెకు వచ్చిన కలెక్టర్‌కు కాలనీవాసులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ క్రమంలో అధికారులు కాలనీని సందర్శించారు. ఇక్కడి పరిస్థితులను తెలుసుకున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.





కుప్పంలో, చౌడేపల్లెలో వినాయక విగ్రహాల కొనుగోళ్లు

వినాయక ఉత్సవాలకు సర్వం సిద్ధం!

కుప్పం, సెప్టెంబరు6: వినాయక చవితి ఉత్సవానికి పల్లె, పట్టణాలలో సర్వం సిద్ధమైంది. శనివారం నాటి పండుగ కోసం శుక్రవారం పొద్దుపొద్దంతా కొనుగోళ్ల మయమైంది. యువత మండపాల నిర్మాణంతోపాటు వినాయక విగ్రహాల తరలింపులో నిమగ్నమైతే, పెద్దలంతా పండుగకు కావాల్సిన సంబరాలను సమకూర్చు కోవడంలో కాలం గడిపేశారు. కుప్పంలోని నేతాజీ రోడ్డు మొత్తం వినాయక ప్రతిమలతో నిండిపోయింది. తోపుడు బండ్లమీద, ఫుట్‌పాత్‌లలోనూ వెలగ, జామ, యాపిల్, కమల, సీతాఫలం, అరటి వంటి పండ్ల దుకాణాలు వెలిశాయి. పత్రి పూజంటే ప్రియం వినాయకునికి. అందుకని ఊరూవాడా గాలించి మరీ కొందరు కొన్నిరకాల ప్రత్యేకమైన ఆకులను ఫుట్‌పాత్‌లపై పోగులుపోసి అమ్మకాలు సాగించారు. మరోవైపు కాగితపు గొడుగులు, అరటి పిలకలు, ఇతర పూజా ద్రవ్యాల కొనుగోళ్లు కూడా సాగాయి. పల్లెలనుంచి కుప్పానికి వచ్చిన జనంతో పట్టణంలోని ప్రధాన వీధులు కిటకిటలాడాయి. ట్రాక్టర్లు, ఇతర వాహనాల ద్వారా ఆయా మండపాలకు గణనాథులు తరలారు. మండపాల వద్ద విద్యుత్ కాంతులు దాదాపు పూర్తయ్యాయి. మూడు నుంచి 9 రోజుల దాకా వినాయక విగ్రహాల ప్రతిష్ఠించిన మొదలు నిమజ్జనం వరకు అవసరమైన ఏర్పాట్లలో యువత తలమునకలైంది.

పుంగనూరు: పుంగనూరు పట్టణం, మండల పరిధిలో వినాయక విగ్రహాలు నిలిపేందుకు అవసరమైన ప్రాంతాల్లో పందిళ్లు ఏర్పాటు చేశారు. విద్యుత్ దీపాలతో అలంకరించారు. పూజలకు అవసరమైన వస్తువులు చిన్న ప్రతిమలు, అరటి, మామిడి, వెలగ, జామ, దానిమ్మ, జిల్లేడు, బిల్వపత్రి, గరిక తదితరాలతో పాటు వినాయకుని ప్రీతికరమైన పండ్ల విక్రయాలు భారీగా జరగాయి. గ్రామాలకు విస్తృతంగా విగ్రహాలను తరలించారు. విగ్రహాలు ఈ ఏడాది అధిక ధరలు పలికాయి. రూ.5వేలు నుంచి రూ. 30వేలు వరకు పలికాయి. కొనుగోలుదారులతో పట్టణం కిక్కిరిసింది. పలుమార్లు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ లోకేశ్‌లు బందోబస్తు ఏర్పాటు చేశారు.

చౌడేపల్లె: గణపతి విగ్రహాల కొనుగోలుదారులతో బస్టాండు సందడిగా మారింది. శుక్రవారం మధ్యాహ్నం నుంచి స్థానిక బస్టాండు సమీపంలో, గాంధీ వీధి వద్ద, వినాయక దుకా ణాల వద్ద పండుగ వాతావరణం నెలకొంది. అర అడుగు చిన్న మట్టి విగ్రహం రూ.120 ధర పలుకుతోంది. ధరలు ఎలా ఉన్నా డిమాండ్ తగ్గలేదు.

కార్యకర్తలకు అండగా ఉంటా: చల్లా బాబు



టీడీపీ జెండా అవిష్కరిస్తున్న చల్లాబాబు

రొంపిచెర్లసెప్టెంబరు 6: పుంగనూరు నియోజకవర్గంలో ఏ నాయకుడికైనా, కార్య కర్తకైనా కష్టం వస్తే తాను అండగా ఉంటానని నియోజకర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని పెద్దగొట్టిగల్లు పంచాయతీ శ్రీనాథపురం కాలనీలో టీడీపీ జెండాను చల్లాబాబు ఆవిష్కరించారు. అలాగే మొక్కలు నాటారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఉయ్యాల రమణ, రాజంపేట పార్లమెంట్ తెలుగురైతు ఉపాధ్యక్షుడు ఓబులేశ్వరరెడ్డి, పులిచెర్ల జడ్పీటీసీ మురళీధర్, రామమూర్తి, పులిచెర్ల మురళీనాయుడు, సుధాకరచౌదరి, మదనమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులు సేంద్రియ వ్యవసాయ పద్ధతులు పాటించాలి



కనమనపల్లెలో పంటలను పరిశీలిస్తున్న అధికారులు

గుడుపల్లె, సెప్టెంబరు 6: రైతులు సేంద్రియ వ్యవసాయ పద్ధతులు పాటించాలని జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు నాగపద్మిని కోరారు. శుక్రవారం కనమనపల్లెలో వివిధ పంటలలో పాటించవలసిన మేలైన యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సేంద్రియ, ప్రకృతి వ్యవసాయం, భూసార పరీక్షల ఆధారిత ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు. ఏరువాక కేంద్ర శాస్త్రవేత్త సంధ్యరాణి వరి, రాగి, వేరుశెనగ పంటల సాగుకు రైతులకు తగిన సూచనలు చేశారు. ఏవో నాగరాజు రైతులు చిరుధాన్యాల సాగును పోత్సహించాలని, ప్రకృతి వ్యవసాయాన్ని పాటించాలని కోరారు. స్థానిక నాయకులు, రైతులు, ఆర్బీకే నవీద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ముమ్మరంగా పారిశుధ్య పనులు

గుడుపల్లె, సెప్టెంబరు 6: మండలంలోని 18 పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో నెలరోజుల పాటు ముమ్మరంగా పారిశుధ్య పనులను చేపడుతున్నట్లు ఎంపీడీవో తాజ్ మస్సూర్ తెలిపారు. గుండ్లసాగరం పంచాయతీలో శుక్రవారం చేపట్టిన పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. వీధుల్లో అక్కడక్కడా పేరుకుపోయిన చెత్త దిబ్బలను ఎక్స్‌కవేటర్‌తో తొలగించాలని ఆదేశించారు. కాలువలో ఉన్న మురుగు, చెత్తలను తొలగించి, శుభ్రపరిచి బ్లీచింగ్ చల్లాలని పారిశుధ్య కార్మికులకు సూచించారు. వీధుల్లో ఖాళీగా ఉన్న స్థలాల్లో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు తొలగించాలని, మంచి నీటి ట్యాంకులను శుభ్రం చేసి క్లోరినేషన్ చేయించాలని కార్యదర్శిని ఆదేశించారు. మురుగు కాలువల్లో దోమలు వృద్ధి చెందకుండా మందులను స్ప్రే చేయించాలని చెప్పారు. నెల రోజుల పాటు జరిగే స్పెషల్ డ్రైవ్‌లో గ్రామాల్లో స్వచ్ఛ గ్రామాలుగా మారుతాయని ఎంపీడీవో తెలిపారు.

రామకుప్పం: గ్రామాల్లో సచివాలయ అధికారులు, సిబ్బంది పారిశుధ్య కార్యక్రమాల పై శ్రద్ధ చూపాలని టీడీపీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, తెలుగు రైతు విభాగం నియోజికవర్గ అధ్యక్షుడు చలపతి, ఎంపీడీవో ఈశ్వరన్న కోరారు. శుక్రవారం బైపరెడ్లపల్లెలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. సర్పంచ్ ఆనంద్ పాల్గొన్నారు.

వరద బాధితులకు కూరగాయల వితరణ



వి.కోట, సెప్టెంబరు 6: విజయవాడ వరద బాధితులకు వి.కోట మార్కెట్ వ్యాపారులు లారీ కూరగాయలను వితరణగా పంపారు. శుక్రవారం వి.కోట మార్కెట్ మండీల యాజమానులు పలురకాల కూరగాయలను ప్రత్యేక వాహనంలో విజయవాడకు పంపారు. సీఎం చంద్రబాబు అహర్నిశలు వరద బాదితుల కోసం పడుతున్న కష్టాన్ని గమనించి ఆయన పిలుపు మేరకు ఏఎంసీ మాజీ చైర్మన్ రామచంద్రనాయుడు, టీడీపీ అధ్యక్షులు రంగనాథ్‌ల నేతృత్వంలో పలమనేరు ఆర్డీవో మనోజ్‌కుమార్ చేతుల మీదుగా జెండా ఊపి కూరగాయల వాహనాన్ని అమరావతికి పంపారు. ఈ కార్యక్రమంలో మండీల మజమానులు కేవీ.రెడెప్ప, ఎం.సీ.కృష్ణప్ప, శ్రీనివాసులు, నారాయణస్వామి, సుబ్రమణ్యం, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పూరిగుడిసెకు నిప్పు.. రైతు అదృశ్యం



సోమల, సెప్టెంబరు 6: పొలం వద్ద ఉన్న పూరిగుడిసెకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. అదే సమయంలో గుడిసెలో ఉండాల్సిన రైతు అదశ్యమయ్యాడు. సోమల మండలం సూరయ్యగారిపల్లె యానాదివాడకు చెందిన రమణయ్య మిరపకాయలకుంట ఆటవీశివారులో కొంతభూమిని వ్యవసాయ భూమిగా మార్చుకున్నాడు. మామిడి మొక్కలు నాటుకున్నాడు. వేరుశెనగ సాగుచేశాడు. పొలం వద్ద ఉండేందుకు ఓ పూరిగుడిసె నిర్మించుకున్నాడు.ఆ భూమికి పట్టా ఇవ్వాలని పలుమార్లు ఎస్టీ యూనియన్ తరఫున కలెక్టర్‌కు వినతిపత్రం అందించాడు. ఈ క్రమంలో మరికొందరు యానాదులు ఆ ప్రాంతంలో గుడిసెల ఏర్పాటుకు సిద్ధమయ్యారు. పుంగనూరు అటవీ అధికారులు బుధవారం ఆ ప్రాంతంలో గుడిసెల నిర్మాణానికి అడ్డుచెప్పారు. ఆ గుడిసెలు తొలగించారు. గురువారం రాత్రి రమణయ్య అడవి పందులు రాకుండా పంటను కాపుకాసేందుకు వెళ్లాడు. శుక్రవారం ఉదయం రమణయ్య పొలం నుంచి ఇంటికి రాకపోవడంతో ఆయన భార్య రాజమ్మ, మరికొందరు గ్రామస్తులు పొలం వద్దకు వెళ్లారు. అక్కడ రమణయ్య లేడు. వారి పూరిపాక అగ్నికి ఆహుతై ఉంది. అక్కడి సమీపంలో రమణయ్య చెప్పులు, టార్చ్‌లైట్ పడి ఉన్నాయి. కాగా రమణయ్య వద్ద మేకల అమ్మగా వచ్చిన లక్ష రూపాయలు నగదు ఉన్నట్లు రాజమ్మ తెలిపారు. నగదు కోసం ఎవరైనా కిడ్నాప్ చేసి పూరి పాకకు నిప్పు పెట్టి ఉంటారని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రాజమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు, రెవెన్యూ అధికారులు ఆప్రాంతాన్ని పరిశీలించారు.

గణేష్ మండపాలకు తాత్కాలిక విద్యుత్ సర్వీసులు

పలమనేరు, సెప్టెంబరు6 : పలమనేరు సబ్‌డివిజన్ పరిధిలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేస్తున్న గణేష్ మండపాలకు విద్యుదీకరణకోసం తాత్కాలిక సర్వీసులు ఇస్తున్నట్లు ఏడీఈ చిన్నబ్బ తెలిపారు. మండప నిర్వాహకులు 250 వాట్ విద్యుత్ వినియోగానికి రూ. 500, 250 నుంచి 500 వాట్ వరకు రూ.1000, 500 వాట్‌లకు మించి విద్యుత్ వినియోగించేవారు రూ.1500లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. దీంతోపాటు రూ.750లు అదనంగా చెల్లించి రశీదు పొందితే తమశాఖ లైన్ మెన్ వచ్చి ఇబ్బంది లేకుండా ఎటువంటి ప్రమాదాలకు వీలులేకుండా విద్యుత్ సరఫరా చేయిస్తారని తెలిపారు.

సబ్సిడీపై ఉలవల పంపిణీ

పుంగనూరు రూరల్, సెప్టెంబరు6: రైతులకు రాష్ట్ర ప్రభుత్వం రాయితీతో ఉలవ విత్తనాలను పంపిణీ చేస్తున్నట్లు టీడీపీ నాయకుడు వెంకటరెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని చదళ్ల గ్రామంలోని రైతుసేవా కేంద్రం వద్ద రైతులకు ఉలవ విత్తనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మనోహర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రెడ్డెప్పరెడ్డి, గంగులప్ప, వెంకట్, రెడ్డెప్ప, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో విరూపాక్షి మారెమ్మ

పుంగనూరు రూరల్, సెప్టెంబరు6: పట్టణ నడిబొడ్డున వెలసిన విరూపాక్షి మారెమ్మ శుక్రవారం భక్తులకు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు ఉదయాన్నే ఆలయాన్ని శుద్ధిచేసి మామిడి, వేప ఆకులతో తోరణాలు కట్టి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

భార్య ఆత్మహత్యాయత్నం

పుంగనూరు రూరల్, సెప్టెంబరు6: కుటుంబ కలహాలతో ఓ మహిళ ఆత్మహత్యకు యత్నించింది. ఈ ఘటన శుక్రవారం పెద్దపంజాణి మండలంలో చేటుచేసుకుంది. బాధితురాలి కథనం మేరకు.. పెద్దపంజాణి మండలం బట్టందొడ్డికి చెందిన సుబ్రహ్మణ్యం భార్య గాయత్రి(35) ఇద్దరూ ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. కొంతకాలంగా సుబ్రహ్మణ్యం ఉద్యోగానికి వెళ్లకుండా అప్పులు చేస్తుండటంతో భార్య మందలించింది. దీనిపై దంపతుల మధ్య గొడవ జరిగింది. మనస్తాపానికి గురైన భార్య పురుగుల మందు తాగింది. కుటుంబసభ్యులు గుర్తించి వెంటనే పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మట్టి విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలి



మట్టి విగ్రహాలతో విద్యార్థులు

పుంగనూరు రూరల్, సెప్టెంబరు6: ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలని రాయలసీమ చిల్డ్రన్స్ అకాడమీ పాఠశాల డైరెక్టర్ చంద్రమోహన్‌రెడ్డి కోరారు. శుక్రవారం స్థానిక రాయలసీమ చిల్డ్రన్స్ అకాడమీ పాఠశాల ఆవరణలో విద్యార్థులకు ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసే విగ్రహాల వల్ల పర్యావరణానికి కలిగే నష్టాలను వివరించారు. ఉపాధ్యాయులు రజిని, సౌమ్య, జలజ, వనజ, షాహీనా, సత్య, గౌతమి, ఏసునాథ్, మహేశ్, శివశంకర్ , విద్యార్థులు పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో పనిచేస్తున్నాం: జనసేన

సోమల, సెప్టెంబరు 6: రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని జనసేన మండల అధ్యక్షుడు నాగభూషం రాయల్ పేర్కొన్నారు. శుక్రవారం చిన్నఉప్పరపల్లెలో రైతులకు సబ్సిడీ ఉలవలు పంపిణీ చేశారు. సోమల రైతు సేవా కేంద్రంలో టీడీపీ నాయకులు శివశంకర్, మహేంద్రబాబు, మల్లికార్జున, చాణుక్య, కిషోర్ ఉలవలు పంపిణీ ప్రారంభించారు.

శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు



ప్రత్యేకాలంకరణలో బోయకొండ గంగమ్మ

చౌడేపల్లె, సెప్టెంబరు6: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు నిర్వహించారు. ఆలయ వేద పండితులు అమ్మవారికి రాహు కాలంలో ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధికసంఖ్యలో భక్తులు రాహుకాల పూజలో పాల్గొని అమ్మవారి అభిషేక గంధం, తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఈవో ఏకాంబరం భక్తులకు అన్నదానం తదితర ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వైష్ణవిదేవికి ప్రత్యేక పూజలు

చౌడేపల్లె, సెప్టెంబరు 6: పుదిపట్లలో వెలసిన వైష్ణవిదేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయాన్నే అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ నిర్వాహకులు వినోద్ కుమార్‌రెడ్డి, శ్రావణి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ప్రజలు సుఖసంతోషాలతో గడపాలి

పుంగనూరు, సెప్టెంబరు 6: పుంగనూరు నియోజకవర్గ ప్రజలు ఎలాంటి సమస్యలకు గురికాకుండా సుఖసంతోషాలతో గడపాలని వినాయకుడిని కోరుకున్నట్లు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండపాల వద్ద ఎక్కడా విద్యుత్, ఇతర సమస్యలు తలెత్తకుండా సంతోషంగా పండుగ చేసుకోవాలని కోరారు.

పశువుల్లో గర్భకోశ వ్యాధులు నివారించాలి



ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్న దృశ్యం

కల్లూరు, సెప్టెంబర్ 6: పశువుల్లో వచ్చే గర్భకోశ వ్యాధులను నివారించాలని ఈడీ డీఎల్‌డీఏ బాల సుబ్రమణ్యం, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసులునాయుడు తెలిపారు. పులిచెర్ల మండలం పాళెం పంచాయతీ కోటపల్లిలో శుక్రవారం పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పశువుల్లో ఎదను గుర్తించి కృత్రిమ గర్భ ధారణకు ప్రాముఖ్యత నివ్వాలన్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు, నివారణ చర్యలు తీసు కోవాలని తెలిపారు. అనం తరం రైతులకు ఉచితంగా పశువుల మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారులు మునిచంద్ర, చందనప్రియ, తక్రిష్‌బాషా, శ్రీహరి, శ్రీధర్ పాల్గొన్నారు.

జీతాల కోసం పారిశుధ్య కార్మికుల ధర్నా



పలమనేరు, సెప్టెంబరు6 : పలమనేరు ప్రభుత్వ ఆస్పత్రిలో శుక్రవారం పారిశుధ్య కార్మికులు విధులు బహిష్కరించి సమ్మె చేపట్టారు. ఆరు నెలలుగా జీతాలు అందకపోవడంతో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గిరిధరగుప్తా ఆధ్వర్యంలో ఆస్పత్రి ముందు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు ఆస్పత్రి సూపరిం టెండెంట్ మమతారాణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఓబుల్‌రాజు, ఐద్వా జిల్లా కార్యదర్శి భువనేశ్వరి మాట్లాడుతూ జిల్లా అధికారులు స్పందించి పారిశుధ్య కార్మికులకు వెంటనే బకాయి లేకుండా జీతాలు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

వెల్లువెత్తుతున్న వినతులు

కుప్పం, సెప్టెంబరు 6: కుప్పం పురపాలక సంఘం పరిధిలో మున్సిపల్ అధికారులు వార్డుల వారీగా నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి వినతులు వెల్లువెత్తుతున్నాయి. పురపాలక సంఘంలోని 3వ వార్డు బైరుగానిపల్లె, బాబునగర్‌లలో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు పెద్దసంఖ్యలో ఈ కార్యక్రమానికి వచ్చి వివిధరకాల సమస్యలపై వినతులు అందించారు. పింఛన్లు, గృహ నిర్మాణం వంటి వాటిపై అధిక వినతులు అందాయి. వినతులకు సంబంధించి అధికారులు ప్రజలకు రశీదులు ఇచ్చారు. పరిమిత కాల వ్యవధిలోగా సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కుప్పం మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, ఏఎంసీ మాజీ చైర్మన్ సత్యేంద్రశేఖర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ జిమ్ దాము, పురపాలక సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి వినాయకుడు పర్యావరణ పరిరక్షకుడు



కల్లూరు, సెప్టెంబరు 6: మట్టి వినాయకుడు పర్యావరణ పరిరక్షకుడని రాష్ట్ర కుమ్మరి శాలి వాహన సేవా సంఘం కన్వీనర్ గురుస్వామి తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఆ సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా 300 విగ్రహాలు పంపిణీచేశారు. హెచ్‌ఎం శ్రీవాణి, పాఠశాల కమిటీ చైర్మన్ అష్రఫ్, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE
SENIOR CIVIL JUDGE COURT
PALAMANERU CAMP AT KUPPAM
Succession O.P.No. 2 Of 2024
(In the matter of HINDU Succession Act under section 372)

Between :
V.Bhargavi ...Petitioner
And:
1. M.Jayappa - RI
M.Jayappa, aged 32 years, S/o. Late Muneppa, residing at Kotamaakapalli village, ON Kotthuru Post, Gudipalli Mandal, Chittoor District,
... Respondent No.1
2. Smt. Munemma, aged about 65 years, Wife of Late Muneppa, residing at Kotamaakapalli village, ON Kotthuru Post, Gudipalli Mandal, Chittoor District,
...Respondent No.2

The petitioner has filed petition for the above matter. If you have got any objection you may appear before this court at 10-30 a.m. on 1st-10-2024 either in person or through an advocate and file your objection. If you fail to do so, the matter will be declared exparte.

Smt. **A.HARITHA.**, BA.,LLB.,
Advocate, Kuppam

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోండి


అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

తవణంపల్లె, సెప్టెంబరు 6 : అంగన్‌వాడీ కేంద్రాల సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణు లు, బాలింతలు, పిల్లలు సద్విని యోగం చేసుకోవాలని పూతల పట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ కోరారు. మండలం లోని ఎ.గొల్లపల్లెలో శుక్రవారం సర్పంచ్ సబితా ఆర్థిక సాయంతో నిర్మించిన వినాయక గుడి గోపురం ప్రారం భోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఎ.గొల్లపల్లెలో రూ.10 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్ర భవనాన్ని ప్రారంభించారు. సర్పంచ్ సబిత, ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్, టీడీపీ నేత ప్రవీణ్ పాల్గొన్నారు. కాగా అంతకు ముందు ఆయన అనారోగ్యంతో మృతి చెందిన జి.గొల్లపల్లె మాజీ సర్పంచ్ పద్మ నాభనాయుడు భార్య రాధమ్మ భౌతికకాయాన్ని సందర్శించి, నివాళులర్పించారు.

టీడీపీ టాప్‌స్కోరర్లకు అభినందన


అభినందిస్తున్న ఎమ్మెల్యే భాను ప్రకాష్

విజయపురం/నగరి, సెప్టెంబరు 6: టీడీపీ యాప్ ద్వారా పార్టీ కంటెంట్‌ను ప్రజల్లోకి విస్తృత స్థాయిలో తీసుకెళ్లడంలో టాప్‌లో నిలిచిన నగరి, విజయపురం మండలాలకు చెందిన వారిని ఎమ్మెల్యే భాను ప్రకాష్ శుక్రవారం అభినందించారు. మంత్రి లోకేశ్ పంపిన ప్రశంసాపత్రాలను అందించారు.

'స్వచ్ఛంద' సేవలను వాడుకోండి


వర్మీకంపోస్ట్ కిట్‌ను అందజేస్తున్న ఏడీ

గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 6: స్వచ్ఛంద సంస్థలు అందజేసే సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని వెటర్నరీ శాఖ ఏడీ మురళీ మోహన్ అన్నారు. కాసా సంస్థ స్థాపించి 75ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆ సంస్థ జోనల్ ఆఫీసర్ కరుణాకరన్ అధ్యక్షతన గంగాధరనెల్లూరు సింగిల్‌విండో కార్యాలయ ఆవరణలో శుక్రవారం 250 మంది పేదలకు రూ.3వేలు విలుచేసే నాటుకోడి పిల్లలు, అజోల్లా, వర్మీకంపోస్టల కిట్లను పంపిణీ చేశారు. తహసీల్దార్ చంద్రశేఖర్, కాసా సంస్థ రాష్ట్ర సభ్యురాలు పుష్ప, మండల వ్యవసాయాధికారిణి భవానీ పాల్గొన్నారు.

ఎస్‌బీ కానిస్టేబుల్ విరాళం



చిత్తూరు, సెప్టెంబరు 6: విజయవాడ వరద బాధితులకు ఎస్‌బీ కానిస్టేబుల్ మురళీకృష్ణ రూ.25వేలు విరాళం అందజేశారు. ఈ మేరకు శుక్రవారం ఎస్పీ మణికంఠకు చెక్కు అందజేశారు. మురళీకృష్ణను ఎస్పీ అభినందించారు.

నేత్రదానంతో ఇద్దరికి చూపు ప్రసాదించండి

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 6: నేత్రదానం ద్వారా మరో ఇద్దరికి చూపు ప్రసాదించాలని పీఎంవో డాక్టర్ హరిప్రసాద్ అన్నారు. శుక్రవారం కాణిపాకం జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు నేత్రదానంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మనిషి తదనంతరం నేత్రదానం చేయవచ్చునన్నారు. హెచ్‌ఎం చంద్రశేఖర్‌నాయుడు, కాణిపాకం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రాజేశ్వరి పాల్గొన్నారు.

బ్యానర్ల తొలగింపుపై అధికారుల నిలదీత

నగరి, సెప్టెంబరు 6: డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన బ్యానర్లను తొలగించడంపై టౌన్‌ప్లానింగ్ అధికారిణి వనజాక్షిని టీడీపీ, జనసేన నాయకులు నిలదీశారు. మాజీ మంత్రి రోజా ఫ్లెక్సీలను కొన్ని నెలలపాటు అలాగే ఉంచి, వీటిని తొలగించడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. మున్సిపల్ ఛైర్మన్ ఆదేశాల మేరకే తొలజుచామని ఆమె తప్పించుకునే ప్రయ త్నం చేయగా నిష్పక్షపాతంగా పనిచే యకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కో వాల్సి వస్తుందని హెచ్చరించారు. నాయకులు గుణశేఖర్, జ్యోతి నాయుడు, వెంకటముని, బాబురెడ్డి, శ్రీనివాసులు, రమేష్‌బాబు, అల్లిముత్తు, కోమల పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణ పనుల పరిశీలన



పూతలపట్టు : మండలంలోని వావిల్‌తోట గ్రామంలో టీడీపీ చిత్తూరు పార్లమెంటు అధికార ప్రతినిధి గంగారపు గోపి సొంత నిధులతో గంగమ్మ ఆలయం నిర్మిస్తున్నారు. పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. గోపి మాట్లాడుతూ ఎన్నికల హామీ మేరకు ఆలయాన్ని నిర్మిస్తున్నామని తెలిపారు.

కమిషనర్‌కు సన్మానం



నగరి, సెప్టెంబరు 6: కొత్తగా బాధ్యతలు చేపట్టిన నగరి మున్సిపల్ కమిషనర్ కేవీ కృష్ణారెడ్డిని టీడీపీ నేతలు శుక్రవారం సన్మానించారు. మున్సిపాలిటీలో సమస్యలను నిష్పక్షపాతంగా పరిష్కరించాలని కోరారు. టీడీపీ పట్టణాధ్యక్షుడు రమేష్‌బాబు, నాయకులు గుణశేఖర్, జ్యోతి నాయుడు, అల్లిముత్తు, రుక్కుం బాలాజీ, వెంకటముని, బాబురెడ్డి, శ్రీనివాసులు, చిట్టి, అశోక్, తిరుమలనాయుడు పాల్గొన్నారు.

ఎదుగుదల చూడలేకే దుష్ప్రచారం
- భీమనేని చిట్టిబాబు నాయుడు

పాలసముద్రం, సెప్టెంబరు 6: తన రాజకీయ ఎదుగుదల చూడలేకే కొంతమంది దుష్ప్రచారం చేస్తున్నారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు నాయుడు పేర్కొన్నారు. శుక్రవారం పాలసముద్రం టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఇసుక, మట్టి ద్వారా సంపాదించుకోవాల్సిన అవసరం తనకు ఎంత మాత్రమూ లేదన్నారు. మండలం నుంచి ఐదు వందల ట్రిప్పుల ఇసుకను తమిళనాడుకు తరలించినట్లు ఆరోపించిన వారు రుజువు చేయాలన్నారు. కొందరు టీడీపీ నాయకులు తమ అవసరాల నిమిత్తం ఇసుకను నిల్వ ఉంచితే దాన్ని తనకు అంటగట్టడం భావ్యం కాదన్నారు. కొందరు కూటమి నాయకులు వైసీపీతో చేతులు కలిపి ఇలాంటి ప్రచారం చేసే ముందు వాస్తవాలు తెలుసుకోవాలని హితవుపలికారు.

వృద్ధులకు అన్నదానం



వెదురుకుప్పం, సెప్టెంబరు 6: కార్వేటినగరం వృద్ధాశ్రమంలో శుక్రవారం తమిళనాడు పళ్లిపట్టుకు చెందిన ఎ.మోహన్‌రాజ్ కుటుంబీకులు వృద్ధులకు అన్నదానం చేశారు. స్వీట్లు పంపిణీ చేశారు. తమవంతు సహాయ సహకారాలను వృద్ధాశ్రమానికి అందిస్తామని దాత తెలిపారు.

మట్టి గణపతిని పూజిద్దాం


వినాయకుడికి పూజలు చేస్తున్న ప్రిన్సిపాల్, విద్యార్థులు

వెదురుకుప్పం, సెప్టెంబరు 6: మట్టి గణపతిని పూజిద్దామని కార్వేటినగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీతా విజయులురెడ్డి కోరారు. శుక్రవారం ఆ కళాశాలలో మట్టి గణపతికి పూజలు చేశారు. మట్టి గణపతిని పూజించడం వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు.

పర్యావరణానికి హాని కలిగించొద్దు

వెదురుకుప్పం, సెప్టెంబరు 6: పర్యావరణానికి హాని జరగకుండా మట్టి వినాయకుడికి పూజలు చేయాలని వెదురుకుప్పం వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నపూర్ణశారద అన్నారు. శుక్రవారం కళాశాలలో ఆమె విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. అనంతరం మట్టితో తయారు చేసిన వినాయకుడినే పూజిస్తామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.

నిరుపేదలకు అన్నదానం



గుడిపాల, సెప్టెంబరు 6: చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ సోదరుడు జగ్జీవన్ జన్మదినం సందర్భంగా నిరుపేదలకు అన్నదానం చేశారు. కేకు కట్‌చేసి, పంచిపెట్టారు. టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, నేతలు బాలాజీ నాయుడు, హేమాద్రి నాయుడు, అనిల్‌కుమార్, చంద్రమోహన్, హరి నాయుడు, మధుసూదన్ నాయుడు, ఉదయ, ఐజాక్, చంద్ర, నాగరాజ్ యాదవ్, జనసేన నాయకులు రూప్‌కుమార్, రమేష్, విల్సన్, బీజేపీ నేతలు ధనంజయ నాయుడు, దేవ, ధనపాల్ పాల్గొన్నారు.

వరద బాధితులకు చేయూత



గుడిపాల, సెప్టెంబరు 6: విజయవాడ వరద బాధితుల కోసం మండలంలోని సీఎస్ఆర్ కళాశాల యాజమాన్యం నిత్యావసర సరుకులు అందజేసింది. వాటిని ఎమ్మెల్యే కార్యాలయంలో అందజేశారు. కళాశాల వ్యవస్థాపకుడు లోకేష్, ప్రిన్సిపాల్ రామచంద్ర, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి అర్జున్ పాల్గొన్నారు.

మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యం


సభ్యత్వ నమోదు ప్రారంభిస్తున్న జగదీశ్వర్ నాయుడు

గుడిపాల, సెప్టెంబరు 6: దేశాభివృద్ధి మోదీతోనే సాధ్యమవుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్ నాయుడు అన్నారు. మండలంలో శుక్రవారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. బీజేపీ జిల్లా నాయకులు దేవరాజన్, అట్లూరి శ్రీనివాసులు, మండలాధ్యక్షుడు ధనుంజయ నాయుడు, నాయకులు సెల్వం, సూర్య, సంజయ్ పాల్గొన్నారు.

పండగ సందడి

- వాడవాడలా వినాయకులు
- చవితి సామగ్రి కొనుగోలుదారులతో మార్కెట్లు కిటకిట



కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న చిత్తూరు చర్చివీధి - నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న అసిస్టెంట్ కమిషనర్ ప్రసాద్

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 6: నగరంలో శుక్రవారం వినాయక చవితి సందడి కనిపించింది. శనివారం పండగ కావడంతో అందుకు కావాల్సిన సరుకులు, పూజా సామగ్రి కొనుగోలులో ప్రజలు నిమగ్నమయ్యారు. బజార్లన్నీ కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. ప్రతి వీధిలోనూ గణేశ ఉత్సవ నిర్వాహకులు చలువ పందిళ్లు ఏర్పాటు చేసి, వినాయక విగ్రహాలను నిలిపారు. కట్టమంచి, గంగినేని, దుర్గానగర్ కాలనీ, డొడ్డిపల్లె, నీవానది, గంగాసాగరం తదితర చెరువుల వద్ద నగర పాలక సంస్థ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నిమజ్జన కార్యక్రమంలో ప్రమాదాలు జరుగకుండా గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశారు.

నిమజ్జానికి ఏర్పాట్లు పూర్తి

చిత్తూరు, సెప్టెంబరు 6: వినాయక నిమజ్జానికి సంబంధించి కట్టమంచి చెరువు వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సహాయ కమిషనర్ ప్రసాద్, ఎంహెచ్‌వో అనిల్‌కుమార్ నాయక్ తెలిపారు. శుక్రవారం కట్టమంచి చెరువు కట్ట వద్ద ఏర్పాట్లను నగరపాలక అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. చెరువు కట్టపై ప్రత్యేక వేదిక ఏర్పాటు చేశారు. బారికేడ్లను నిర్మించారు. లైటింగ్, నీటి సరఫరా, మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేశారు. పెద్ద విగ్రహాలను నిమజ్జనం చేయడానికి రెండు క్రేన్లను సిద్ధం చేశారు. ప్రజారోగ్య విభాగం ఆధ్వర్యంలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. నిమజ్జనం సజావుగా సాగేలా ఉద్యోగులను కేటాయించారు.

కిటకిటలాడిన నగరి మార్కెట్

నగరి, సెప్టెంబరు 6 : వినాయకచవితిని పురస్కరించుకుని నగరి మార్కెట్ శుక్రవారం కొనుగోలుదారులతో కిటకిటలాడింది. పూజకు కావాల్సిన సామగ్రి, కాయకూరలు, సరుకుల కోసం పెద్ద సంఖ్యలో జనం మార్కెట్‌కు తరలివచ్చారు. కొనుగోలుదారులతో దుకాణాలన్నీ నిండిపోయాయి. శనివారం మధ్యాహ్నం వరకు రద్దీ కొనసాగే అవకాశముందని వ్యాపారులు తెలిపారు.

మట్టి వినాయకుడినే పూజించండి

పాలసముద్రం, సెప్టెంబరు 6: మండల ప్రజలు మట్టి వినాయక విగ్రహాలనే పూజించాలని ఎంపీడీవో రామనాథరెడ్డి కోరారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను పెట్టరాదని సూచించారు. మంటపాలకు అనుమతులు తీసుకుని, ప్రశాంతంగా పండగ చేసుకోవాలని కోరారు.

పర్యావరణ హిత పండగ చేసుకుందాం

నగరి, సెప్టెంబరు 6 : పండగలు, వేడుకలు పర్యావరణ హితంగా జరుపుకుందామని నగరి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్ పిలుపునిచ్చారు. కళాశాలలో ఎకో క్లబ్, రెడ్ రిబ్బన్ క్లబ్ సంయుక్తంగా మట్టితో తయారు చేసిన వినాయక బొమ్మలను పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ మట్టి వినాయకుడిని పూజించాలని సూచించారు.

మట్టి వినాయకులకు భలేక్రేజ్

ఐరాల, సెప్టెంబరు 6: ఈ వినాయక చవితికి ఎక్కువ శాతం మట్టి విగ్రహాల కొనుగోలుకు జనం మొగ్గు చూపుతున్నారు. గత ఏడాది కన్నా ఈసారి మట్టి వినాయకుడి విగ్రహాలు ఎక్కువగా సేల్ అవుతున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. ఏటా ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణ వేత్తలు కల్పిస్తున్న అవగాహన వల్లే జనం మట్టి విగ్రహాలను కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

విద్యాభివృద్ధికి టీచర్లే మూలస్తంభాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీమోహన్

పూతలపట్టు, సెప్టెంబరు 6: విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులే మూలస్తంభాలని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. వేము ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన గురుపూజోత్సవంలో ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ బాగా చదువుకుని తల్లిదండ్రులకు, కళాశాలకు మంచిపేరు తీసుకురావాలన్నారు. పలువురు అధ్యాపకులను సన్మానించారు. కళాశాల ఛైర్మన్ చంద్రశేఖర్ నాయుడు, గంటా మోహన్, నాగరాజ్ శెట్టి, కృష్ణమూర్తి రెడ్డి, జ్యోతీశ్వర్ నాయుడు, నవీన్ కిలారి తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు అండగా గురజాల


కృష్ణలంకలో సరుకులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 6: ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ విజయవాడ వరద బాధితులకు అండగా నిలుస్తున్నారు. నాలుగు రోజులుగా వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తూ తనవంతు సాయం చేస్తున్నారు. శుక్రవారం కృష్ణలంక పరిసర ప్రాంతాల్లో ఇంటింటికీ బియ్యం, వంటనూనె, కూరగాయలు, బిస్కెట్లు, పాలు, వాటర్ బాటిళ్లు అందించారు. జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విరాళాలను సేకరించి పంపుతున్నారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త పల్లెంటి సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

వినాయక విగ్రహాల పంపిణీ



చిత్తూరు సిటీ, సెప్టెంబరు 6 : టీడీపీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. పీసీఆర్ కళాశాల వద్ద విజయ్‌తేజ, మోహన్‌రాజ్, యుగంధర్, గోపాల్, ధరణి ప్రకాష్, యువరాజ్, ధరణి కుమార్‌లు విగ్రహాలు పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, పార్టీ చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు సీఆర్ రాజన్, ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, మాజీ మేయర్ కటారి హేమలత విగ్రహాలను పంపిణీ చేశారు. నేతలు వెంకటేష్ యాదవ్, జయచంద్రయాదవ్, రాజశేఖర్, విజయ్‌కుమార్, శ్రీధర్ యాదవ్ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం బోల్తా : ఒకరికి గాయాలు


గాయపడిన జాన్ సాముయేల్

బంగారుపాళ్యం, సెప్టెంబరు 6: చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిలోని పాలేరు బస్టాపు సమీపంలో శుక్రవారం వేకువ జామున ద్విచక్ర వాహనం బోల్తాపడి ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. బెంగళూరు కమ్మనెల్లికి చెందిన జాన్ సాముయేల్ ద్విచక్ర వాహనంలో గంగాధరనెల్లూరు మండలం తూగుండ్రంలోని తన బంధువుల ఇంటికి వస్తుండగా అదుపుతప్పి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడడంతో స్థానికులు బంగారుపాళ్యం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వేలూరు సీఎంసీకి తరలించినట్లు బంధువులు తెలిపారు. బంగారుపాళ్యం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఫోన్ చేసిన గంటకు కూడా 108 వాహనం రాకపోవడంపై అక్కడున్న వారు అసహనం వ్యక్తం చేశారు.

జగ్జీవన్‌కు పలువురి శుభాకాంక్షలు


జగ్జీవన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న హేమలత

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 6: ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ తమ్ముడు గురజాల జగ్జీవన్ జన్మదినం సందర్భంగా బీవీ రెడ్డి కాలనీలోని ఆయన నివాసంలో కేక్ కట్ చేశారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, పార్టీ చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు సీఆర్ రాజన్, ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, మాజీ మేయర్ కటారి హేమలత, నేతలు మోహన్‌రాజ్, రాజశేఖర్, సీఎం విజయ, మురళి, సతీష్, తారాపతి, పూర్ణ మహేష్, రాహుల్ తదితరులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

విద్యాసంస్థల్లో చవితి వేడుకలు



హార్వర్డ్, విజయం పాఠశాలల్లో వినాయక చవితి వేడుకలు

చిత్తూరు (సెంట్రల్), సెప్టెంబరు 6: నగరంలోని పలు విద్యా సంస్థల్లో శుక్రవారం ముందస్తు వినాయక చవితి వేడుకలు నిర్వహించారు. సుందరాజుపురంలోని విజయం సీబీఎస్ఈ పాఠశాలలో విజయం విద్యాసంస్థల అధినేత తేజోమూర్తి, అకడమిక్ డైరెక్టర్ శైలజామూర్తి ఆధ్వర్యంలో విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో వినాయక స్వామి ప్రాముఖ్యతను తెలుపుతూ చేసిన నృత్యాలు, నాటికలు ఆకట్టుకున్నాయి. రాంనగర్ కాలనీలోని హార్వర్డ్ స్కూల్లో కరస్పాండెంట్ భాస్కర్, డైరెక్టర్ త్రివేణి ఆధ్వర్యంలో విద్యార్థులు సంప్రదాయ దస్తులు ధరించి చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అరుణాచల డిగ్రీ కళాశాలలో కరస్పాండెంట్ జగన్నాథరెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. వన్‌టౌన్ సీఐ జయరామయ్య చేతుల మీదుగా గాంధీ సర్కిల్‌లో స్థానికులకు వెయ్యి మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా అందజేశారు.

వరి, వేరుశనగ పంటల సాగుపై రైతులకు శిక్షణ

పూతలపట్టు, సెప్టెంబరు 6: వరి, వేరుశనగ సాగు, దిగుబడిపై డీఆర్సీ వ్యవసాయ శాఖాధికారిణి పద్మజ శుక్రవారం తేనేపల్లి పంచాయతీ పరిధిలోని రైతులకు శిక్షణనిచ్చారు. పంట దిగుబడిపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సలహాలు, సూచనలు చేశారు.

కుట్టు మిషన్ల పంపిణీ



నింద్ర, సెప్టెంబర్ 6: జన్‌శిక్షణ సంస్థాన్ సంస్థ ఆధ్వర్యంలో 20 మంది పొదుపు సంఘాల సభ్యులకు శుక్రవారం కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా వచ్చిన ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం అనంతలక్ష్మి మాట్లాడుతూ మహిళలు ఇంటికి పరిమితం కాకుండా వృత్తి శిక్షణ పట్ల ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. సంఘాల ద్వారా తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. రాస్ అధికారి రవి పాల్గొన్నారు.

నగరి కమిషనర్ బాధ్యతల స్వీకరణ



నగరి, సెప్టెంబరు 6: నగరి మున్సిపల్ కమిషనర్‌గా కేవీ కృష్ణారెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కందుకూరు కమిషనర్‌గా ఉన్న ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. పట్టణ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

తహసీల్దారుగా శ్రావణ్‌కుమార్



పెనుమూరు, సెప్టెంబరు 6: పెనుమూరు తహసీల్దారుగా (ఎఫ్ఏసి) ఐ.శ్రావణ్‌కుమార్‌ను నియమిస్తూ కలెక్టర్ సుమిత్ కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. తిరుపతి జిల్లా ఏర్పేడు డిప్యూటీ తహసీల్దారుగా పనిచేస్తున్న ఈయన్ను పెనుమూరు తహసీల్దారుగా బదిలీ చేశారు. ప్రసుత్తం పెనుమూరు తహసీల్దారుగా (ఎఫ్ఏసి) పనిచేస్తున్న కళ్యాణిని గుడిపాలకు బదిలీ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

జడ్పీ సీఈవోకు సన్మానం



చిత్తూరు రూరల్, సెప్టెంబరు 6: జడ్పీ సీఈవో గ్లోరియాను ఎస్టీయూ నాయకులు శుక్రవారం సన్మానించారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల పీఎఫ్ ఖాతాల సమస్యను పరిష్కరించేలా చొరవ చూపినందుకు సన్మానించినట్లు ఎస్టీయూ నాయకులు పేర్కొన్నారు. ఎస్టీయూ నాయకులు మదన్ మోహన్, పురుషోత్తం, దేవరాజులు, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

టీడీపీ నేతకు పలువురి శుభాకాంక్షలు


కేక్ కట్ చేస్తున్న పురుషోత్తం నాయుడు

నగరి, సెప్టెంబరు 6 : టీడీపీ నగరి మండల కార్యదర్శి కె.పురుషోత్తంనాయుడుకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. పుట్టిన రోజును పురస్కరించుకుని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన కేక్ కట్ చేశారు. మండలాధ్యక్షుడు శివకుమార్‌రెడ్డి, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి బాలాజీ, నాయకులు నారాయణస్వామి నాయుడు, రాజా, దేవా, ఢిల్లీరెడ్డి, దయాలన్, జయపాల్, వెంకీ, ధనంజయలు, పెరుమాళ్, గోపి పాల్గొన్నారు.

గ్రామాలకు గణపయ్యలు

విజయపురం, సెప్టెంబరు 6: మండలంలోని గ్రామీణ యువత నగరి, పుత్తూరు, పిచ్చాటూరు, తిరుపతి, తిరువళ్లూరు, తిరుత్తణి ప్రాంతాల నుంచి వినాయక విగ్రహాలను తమ గ్రామాలకు తరలిస్తున్నారు. మూడు నుంచి 10 అడుగుల విగ్రహాలను రూ. 3 వేలు నుంచి 15 వేల వరకు కొనుగోలు చేస్తున్నారు. పన్నూరు సబ్‌స్టేషన్, విజయపురం, ఇళ్లత్తూరు, మహారాజపురం, కోసలనగరం ప్రాంతాల్లో పెద్ద విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు.

ఉద్యోగులపై వేధింపులు మానుకోవాలి

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 6: ప్రభుత్వం ఉద్యోగులను వేధించడం మానుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామానాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఐ కార్యాల యంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో వివిధ శాఖల్లో పనిచేసిన ఉద్యోగులను ప్రజా ప్రతినిధులు వేధించడం సరికాదన్నారు. ప్రభుత్వ భూములను కబ్జా చేసిన వారిని ఇంతవరకు ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు, సహాయ కార్యదర్శి జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.